



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హాజరైన వివిధ శాఖల అధికారులు

నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 20 డిసెంబర్ 2023 | ADILABAD

## 'కడెం'ను సందర్శించిన స్కాడా బృందం

కడెం, డిసెంబర్ 19 : కడెం ప్రాజెక్టును మంగళవారం స్కాడా నిపుణుల బృందం సందర్శించింది. జలాశయం వద్ద సీసీ కెమెరాలు, స్క్రీన్ మానిటరింగ్ విధానాలు, సెన్సార్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులు పూర్తి కావస్తున్నాయని, మరమ్మతులు ఆలస్యం అవుతున్నాయని, త్వరలోనే స్కాడా సిస్టం పనులు పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు. పర్యటించిన వారిలో రాకేశ్ భట్, సభ్యులు ఈఈ శర్మ, డిప్యూటీ ఈఈ మాధవి, ఏఈఈ రమాదేవి, ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.



కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న స్కాడా నిపుణుల బృందం

## అభివృద్ధి, సంక్షేమ పథకాల నివేదికలు సిద్ధం చేయండి..

- రేపు సీఎం రేవంత్‌రెడ్డితో కలెక్టర్ల సమావేశం..
- ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి..
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 19 : అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికలు సిద్ధం చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 21వ తేదీన హైదరాబాద్‌లో ముఖ్యమంత్రితో కలెక్టర్ల సమావేశం ఉన్నందున మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుబంధు, కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ, కొత్త రేషన్ కార్డులకు అర్హుల అంచనాలు, పెన్షన్లు, మహాలక్ష్మి, గృహలక్ష్మి వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాలవారీగా ధరణి, భూ సమస్యలు, ప్రభుత్వ, ప్రైవేట్ భూ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పూర్తి సమాచారం అందించాలని వివరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతివారం మండలాలవారీగా పెండింగ్ గ్రీవెన్స్‌ల సమీక్ష చేయాలని, దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు గుండెపోటుతో ఈనెల 18వ తేదీన మృతిచెందిన భీంపూర్ తహసీల్దార్ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు స్రవంతి, జివాకర్, అధికారులు పాల్గొన్నారు.



భీంపూర్ తహసీల్దార్ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

# పత్తి రైతుల పైసల గోస

**కేంద్ర పరిధిలోని సీసీఐ డబ్బులు చెల్లించక పోవడంతో ఆవేదన**

- మూడు రోజుల్లో పడాల్సిన పైకం పక్షం రోజులైనా పడడం లేదు..
- రుణాల కింద బ్యాంకర్ల కోత.. ఆధార్ విధానంతో అవస్థలు..
- మార్కెటింగ్ ఏడీకి రైతు సంఘాల నాయకులు, రైతుల ఫిర్యాదు



ఆదిలాబాద్ జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు, నాయకులు

### డబ్బులు ఇప్పించండి..



ఈ నెల 14వ తారీకున ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో 16 క్వింటాళ్ల పత్తి సీసీఐకి అమ్మిన. పట్టా పాసు పుస్తకం, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలు ఇచ్చినం. వేలి ముద్ర తీసుకుని ఆధార్ విధానంలో దూది కొనుగోలు చేశారు. రూ.1.17 లక్షలు రావాలి. మూడు రోజుల్లో పైసలు బ్యాంకు ఖాతాల్లో పడుతాయని అధికారులు చెప్పారు. ఆరు రోజులవుతున్నా పడలేదు. నాకు రామాయిలోని గ్రామీణ బ్యాంకు, ఆదిలాబాద్‌లోని ఎస్‌బీఐలో ఖాతాలు ఉన్నాయి. నాలుగు రోజుల నుంచి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా పైసలు పడలేదని చెబుతున్నారు. సీసీఐ అధికారులు మాత్రం వేశామని అంటున్నరు. ఏమి చేయాలో తోచడం లేదు. అధికారులు నాకు పంట డబ్బులు ఇప్పించాలి.

- భూంరెడ్డి, రైతు, రామాయి, జైనథ్ మండలం

ఆదిలాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నది. క్వింటాలుకు రూ.7,020 మద్దతు ధర పెట్టి మార్కెట్ యార్డుల్లో కొంటున్నది. కొన్ని చోట్ల సీసీఐ సక్రమంగా కొనకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో సీసీఐ ఆధార్ అథంటికేషన్ విధానంలో పత్తి కొనుగోలు చేస్తున్నది. రైతుల వేలిముద్రలు సేకరిస్తున్నది. మద్దతు ధర వస్తుందని ఆశించిన అన్నదాతలకు నిరాశే మిగులుతున్నది. సీసీఐ మూడు రోజుల్లో వేయాల్సిన డబ్బులు పక్షం రోజులైనా ఖాతాల్లో జమ చేయడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం ఆధార్ లింక్ ఉన్న బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయని పేర్కొంటున్నారు. ఒక్కో రైతుకు రెండు, మూడు బ్యాంకుల ఖాతాలు ఉండడంతో ఏ బ్యాంకులో డబ్బులు పడ్డాయో తెలియక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు రైతులు అప్పు చెల్లించాల్సి ఉండడంతో బ్యాంకర్లు డబ్బులను రుణం కింద జమ చేసుకుంటున్నారు. డబ్బుల జాప్యంపై రైతు సంఘాల నాయకులు, రైతులు మంగళవారం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. సీసీఐ డబ్బులు సక్రమంగా అందేలా చూడాలని, రుణం కింద డబ్బులు బ్యాంకర్లు జమ చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### అధికారులు చర్యలు తీసుకోవాలి..



పత్తి కొనుగోళ్లలో ఆధార్ అథంటికేషన్ విధానం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళా రైతులు పత్తిని విక్రయించడానికి మార్కెట్ యార్డుకు వచ్చి గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. అన్నదాతలకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఏ ఖాతాలో డబ్బులు పడ్డాయో తెలియడం లేదు. పత్తి విక్రయించేటప్పుడు ఆధార్, పట్టా, బ్యాంకు పాసు పుస్తకాలు ఇస్తున్నాం. రైతులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- స్వామి, రైతు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం

### సహాయ కేంద్రం ఏర్పాటు చేయండి..



రైతులు అమ్మిన పత్తి డబ్బులు బ్యాంకుల్లో జమ కావడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రైతులకు సంబంధించిన ఏ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయో తెలియడం లేదు. కొందరు బ్యాంకర్లు రైతుల పంట డబ్బులను రుణం కింద జమ చేసుకుంటున్నారు. రైతులు ఇచ్చిన బ్యాంకు వివరాల ప్రకారం డబ్బులు జమ చేయడం లేదు. ఈ సమస్యల పరిష్కారం కోసం అధికారులు మార్కెటింగ్ కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- బండి దత్తాత్రి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



క్రికెట్‌లో మొదటి బహుమతి సాధించిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

## ముగిసిన క్రీడలు

**బహుమతులు ప్రదానం చేసిన ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**

ఎదులాపురం, డిసెంబర్ 19 : శారీరకంగా, ఆరోగ్యంగా ఉండడానికి క్రీడలు దోహదపడుతాయని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లాస్థాయి పోలీస్ క్రీడాపోటీలు కొనసాగుతుండగా.. మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీ మాట్లాడారు. పోలీసు సిబ్బంది విధులతోపాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ వ్యాయామం, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.




వాలీబాల్ జట్టుకు మొదటి బహుమతి అందజేస్తూ..

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374
CHANGE OF NAME
★I, GURUPADH BADRA, (Old Name) R/o. 8-114/1, Teegalpahad, Naspur 504302 have Changed ny name as GURUPADA BHADRA S/O. RAJ BIHARI BHADRA (New Name)
NTK-317311
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# వంటింట్లో ధరల మంట

- రెట్టింపైన కూరగాయల ధరలు
- అకాల వర్షాలకు దెబ్బ తిన్న పంటలు
- కార్తీకం, షష్ఠి, దీక్షలు కూడా కారణమే..




మంచిర్యాల, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్‌లో భగభగ మండుతున్నాయి. ఇప్పటికే బియ్యం ధరలు ఆకాశాన్నంటుతుండగా.. అదే దారిలో వెజిటేబుల్స్ రేట్స్ కూడా రెట్టింపు(డబుల్) అయ్యాయి. రెండు నెలల క్రితం రూ.200 నుంచి రూ.300లు మార్కెట్‌కు తీసుకెళ్తే వారానికి సరిపడా కూరగాయలు వస్తే.. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.800 పెట్టినా రావడం లేదు. ధర తక్కువగా ఉన్న టమాట, ఆలు, పప్పులతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నదని జనం పేర్కొంటున్నారు. అల్లం, ఎల్లిగడ్డ, ఉల్లిగడ్డ ధరలు కూడా గతంలో పోలిస్తే రెట్టింపు అయ్యాయని, ఏం కొనాలన్న కిలోకు రూ.100 ఉంటోందని వాపోతున్నారు.

**కూరగాయలు (కిలో ధర-రూపాయలు)**

| కూరగాయలు | రెండు నెలల క్రితం | ప్రస్తుతం |
|---|---|---|
| మిర్చి | 30 | 60 |
| మునగ | 60 | 130 |
| బీర | 40 | 120 |
| చిక్కుడు | 70 | 130 |
| బెండ | 30 | 100 |
| ఆనప | 40 | 100 |
| వంకాయ | 30 | 100 |
| దొండ | 30 | 80 |
| కాకర | 40 | 80 |
| గోరు చిక్కుడు | 40 | 80 |
| బీన్స్ | 40 | 80 |
| అలసంద | 30 | 80 |
| బీట్‌రూట్ | 60 | 80 |
| కాలిఫ్లవర్ | 20 | 80 |
| క్యాబేజీ | 30 | 60 |
| టమాట | 20 | 40 |
| దోస | 40 | 60 |
| ఉల్లిగడ్డ | 50 | 100 |
| ఎల్లిగడ్డ | 150 | 300 |
| అల్లం | 150 | 140-200 |

### ఎందుకు పెరిగాయి..

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నేలరాలింది. దీనికి తోడు వాతావరణంలో మార్పులు రావడంతో చీడపీడలు పడుతూ.. పూత, కాత రాకుండా పోయింది. సమయానికి వర్షాలు కురియకపోవడం, చలి తీవ్రత అధికంగా ఉండడం వంటి కారణాలతో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గింది. ఇదే సమయంలో అవసరాలకు సరిపడా పంటలు సాగులోకి రాలేదని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. మన వద్ద పంటలు దెబ్బతినడంతో చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి హైదరాబాద్‌కు అక్కడి నుంచి మిగిలిన జిల్లాల మార్కెట్‌లకు కూరగాయలు సరఫరా అవుతున్నాయి. దీంతో ట్రాన్స్‌పోర్ట్, హమాలీ చార్జీలు పెరగడంతో ధరలు కూడా అమాంతం పెరిగాయి. మొన్నటి వరకు కార్తీకమాసం కావడం, ఇప్పుడు షష్ఠి(మల్లన్న బోనాలు), అయ్యప్ప, సాయిదీక్ష తీసుకున్న భక్తులు అధికంగా ఉండడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది.

### ఉత్పత్తి లేకపోవడమూ కారణమే..

అవసరానికి సరిపడా కూరగాయల ఉత్పత్తి లేదు. పంట నష్టంతోపాటు అది కూడా ధరలు పెరిగేందుకు కారణం. మంచిర్యాల మార్కెట్‌కు అధికంగా బెల్లంపల్లి, మంచిర్యాల రూరల్ ఏరియాల నుంచే కూరగాయలు వస్తాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దిగుమతి పెరిగింది. చలి నుంచి చల్లటి గాలుల నుంచి పంటకు రక్షించుకోవాలంటే విత్తనాలు వేసేప్పుడే కూరగాయల చుట్టూ మక్క లేదా బంతి వేసుకోవాలి. అప్పుడు గాలులతోపాటు చీడపీడల నుంచి రక్షణ ఉంటుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కాలీఫ్లవర్, క్యాబేజీ వేసుకుంటే మంచిది.

- ఉదయ్, హార్టికల్చర్ జిల్లా అధికారి, మంచిర్యాల.

### కూరగాయల ధరలు భగ్గు మంటున్నయ్..

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 19 : వామ్మో.. మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గు మంటున్నయ్.వం కాయ,చి క్కుడుకాయ, బీరకాయల రేట్లైతేచెప ్పనవసరం లేదు. ఏం కొందామన్నా మార్కెట్ల కిలోకు రూ.80 నుంచి రూ.100 వరకు చెపుతన్నరు. దీంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలప రిస్థితేంటి. ఒక్కప్పుడు రూ.300 పట్టుకపోతే వారానికిసరి పడా కూరగాయలచ్చేవి.ఇ ప్పుడు రెండుమూడ్రోజులకుసరి పడా కూడా రావడం లేదు. ఏదేమైనా కూరగాయల ధరలు తగ్గాలని ప్రతి ఒక్కరూ కోరుకుటున్నరు.

- మాదాసు శ్రుతి, గృహిణి

## పోటీ ప్రపంచంలో ముందుండాలి..

- నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 19 : విద్యార్థులు గణితంలో మెలకువలు సాధించి పోటీ ప్రపంచంలో ముందుండాలని నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎస్సార్ ప్రైమ్ పాఠశాలలో మంగళవారం టీఎంఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులు భావి గణిత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు చట్ల శ్రీనివాస్, మండల విద్యాధికారి కె.శంకర్, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారి రాజేశ్వర్, నర్సయ్య, శ్రీదేవి, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఫోరం ప్రధాన కార్యదర్శి ఎ.మనోహర్‌రెడ్డి, కోశాధికారి జి.విజయభాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.అశోక్, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్. రవి గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాందాస్, ఫోరం బాధ్యులు మమత పాల్గొన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి

## ఆయిల్ పామ్ సాగు భేష్

- రైతులు దృష్టి సారించాలి.. అధిక లాభాలు పొందవచ్చు..
- పెంబి మండలంలో పర్యటించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పెంబి, డిసెంబర్ 19 : ఆయిల్ పామ్ సాగు బాగుందని, అధిక లాభాలు పొందవచ్చని, రైతులు దృష్టి సారించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం పెంబి మండలంలోని నాగాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరిజన రైతు ఉత్పత్తి దారుల సంస్థ, పామాయిల్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 504 మంది రైతులు ఐకమత్యంతో గిరిజన ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా సేవలు అందిస్తుండడం అభినందనీయమని కితాబిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి అంజీప్రసాద్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఏవో ఆసం రవి, ఎంపీవో రత్నాకర్‌రావు, సర్పంచ్ పూర్ణ చందర్ గౌడ్, ఏఈవోలు పాల్గొన్నారు.



ఉట్నూర్ : భారీ ర్యాలీ తీస్తున్న ఆటో డ్రైవర్లు

## మా బతుకులు ఆగం చేయద్దు..

- ఉచిత బస్ ప్రయాణం సరే.. మాకు ఉపాధి చూపండి..
- ఆటో డ్రైవర్లు, ఓనర్ల యూనియన్‌ల ఆధ్వర్యంలో ఆందోళనలు

ఉట్నూర్/నార్నూర్/ఇంద్రవెల్లి, డిసెంబర్ 19 : కాంగ్రెస్ సర్కారు ప్రజలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించి మా పొట్ట కొడుతున్నదని, మా బతుకులను ఆగం చేస్తున్నదని ఆటో డ్రైవర్లు, ఓనర్స్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉట్నూర్ పట్టణం, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల ఉట్నూర్ మండల శాఖ గౌరవ అధ్యక్షుడు దావుల రమేశ్, నార్నూర్ మండల ఆటో యూనియన్ సంఘం మండలాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఇంద్రవెల్లి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు గాయక్‌వాడ్ భారత్ మాట్లాడారు. ఆటోల మీదనే ఆధారపడి జీవించే మా పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల స్కూల్ ఫీజులు, ఫైనాన్స్‌లు కట్టక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. మా కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి : అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతూ..